ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 11 మార్చి 2025



మెదక్‌కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
రూ.200 కోట్లు మంజూరు
25 ఎకరాల స్థల సేకరణ కోసం కసరత్తు
అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
7

సమ్మర్.. బీ కేర్ ఫుల్



ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

వడదెబ్బ తగలకుండా చూసుకుందాం

ఎండలు మండిపోతున్న వేళ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఓవైపు రాత్రి చలి ఇంకా పోనేలేదు.. పగటిపూట వాతావరణం నిప్పుల కొలిమిలా మండుతున్నది. మార్చి రెండో వారంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువవుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎలా ఉంటాయని ఆందోళన వ్యక్తమవుతున్నది. వేసవి తీవ్రతకు ఆరోగ్యం దెబ్బతినకుండా నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తల గురించి తెలుసుకుందాం. 7

సంగారెడ్డి కల్వకుంటలో దుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవంలో నిర్మలాజగ్గారెడ్డి



దుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులతో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి 7వ వార్డు పరిధిలోని కల్వకుంటలో శ్రీ దుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ బోయిని విజయలక్ష్మీ శేఖర్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతా స్థాపిత పూజ, యంత్రస్థాపిత పూజ, శ్రీదుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠాపన, అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో వేద పండితులు నిర్మలా జగ్గారెడ్డిని సన్మానించి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని సహకరించిన స్థానిక కాలనీ పెద్దలకు, భక్తులకు, మహిళలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నెల 16వ తేదీ (ఆదివారం) దుర్గామాత నూతన విగ్రహం ప్రతిష్ఠాపన చేసిన సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సవాళ్ల స్వాగతం

సంగారెడ్డి పోలీస్‌బాస్‌గా పరితోష్ పంకజ్

అక్రమ రవాణా, అరాచకాలు, సైబర్ నేరాలకు అడ్డాగా జిల్లా

పేట్రేగిపోతున్న గంజాయి, ఇసుక, రేషన్ బియ్యం మాఫియా

పెరుగుతున్న దోపిడీలు, హత్యలు, అత్యాచారాలు

పోలీస్‌శాఖలో అవినీతి తిష్ఠవేయడంపై విమర్శలు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 10: సంగారెడ్డి జిల్లా పోలీస్‌బాస్‌గా బాధ్యతలు చేపట్టిన పరితోష్ పంకజ్‌కు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. ఓవైపు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలు.. మరోవైపు కర్ణాటక, మహారాష్ట్రతో అంతర్‌రాష్ట్ర సరిహద్దులు.. దీనికితోడు విస్తరించిన రియల్‌ఎస్టేట్ రంగం, భారీ పరిశ్రమలు ఉన్న సంగారెడ్డి జిల్లా ఎస్పీగా పని చేయడమంటే కత్తిమీద సవాలే. జిల్లామీదుగా వెళ్లే కీలకమైన జాతీయ రహదారులపై నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు ప్రమాదాల నివారణ కూడా కీలకమే.

అక్రమ రవాణా

సంగారెడ్డి జిల్లా మీదుగా టన్నుల కొద్దీ గంజాయిని అక్రమంగా కర్ణాటక, మహారాష్ట్రకు చేరవేస్తుంటారు. జిల్లాలోని జాతీయ రహదారులపై చేపట్టే తనిఖీల్లో తరచుగా పెద్దఎత్తున గంజాయి పట్టుబడుతుంటున్నది. పోలీసులు ఎంత ముమ్మరంగా తనిఖీలు చేసిన ఎలాగోలా ఏమార్చి అక్రమ రవాణా చేస్తున్నారు. తాజాగా సెప్టిక్‌ట్యాంక్ క్లీనర్ వాహనంలో 205 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడిన ఘటన సంచలనంగా మారింది. ఇలా.. వందల కేసులు నమోదుచేసినా గంజాయి రవాణాకు అడ్డు లేకుండా పోతోంది.

రేషన్ బియ్యం అక్రమ రావాణాకు కూడా జిల్లానే కేంద్రంగా నిలుస్తున్నది. పేదలకు ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని దళారులు సేకరించి మహారాష్ట్ర, కర్ణాటకకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇందుకోసం అంతర్‌రాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉన్న పట్టణాల్లో ప్రత్యేకంగా అడ్డాలను ఏర్పాటు చేసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో గతేడాది 15వేల క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. గుట్టుచప్పుడు కాకుండా సరిహద్దులు దాటింది ఇంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలుస్తున్నది. పోలీసులు తనిఖీలు చేసినప్పుడు కొంతకాలం స్తబ్దుగా ఉండటం.. మళ్లీ దందా కొనసాగించడం అక్రమార్కులకు అలవాటుగా మారింది.

జిల్లాలో ఫిల్టర్ ఇసుక తయారీ జోరుగా సాగుతున్నది. జిల్లాలో రియల్ జోరు కొనసాగుతుండటంతో నిర్మాణాలు పెద్దసంఖ్యలో సాగుతుంటాయి. నాణ్యమైన ఇసుక రేటు భారీగా పెరగడంతో ఫిల్టర్ ఇసుకకు డిమాండ్ పెరిగింది. మట్టి నుంచి ఇసుకను తయారుచేసి విక్రయించడం ద్వారా పలువురు అక్రమార్కులు కోట్లు గడిస్తున్నారు. జిల్లాకేంద్రమైన సంగారెడ్డి శివార్లలోని పలు గ్రామాల్లో ఇసుక ఫిల్టర్లు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. పోలీసులు, అధికారులు దాడులుచేసి ధ్వంసం చేసినా మరుసటి రోజే ఫిల్టర్‌ను మళ్లీ ప్రారంభిస్తున్నారు.

శాంతిభద్రతల సవాలు

సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కూడా సవాలుగానే నిలుస్తున్నది. హత్యలు, అత్యాచారాలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి. పారిశ్రామికవాడలు, రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగాలు విస్తరించడంతో జిల్లాలో వలస కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు వివాహేతర సంబంధాలు హత్యలకు దారితీస్తున్నాయి. గతేడాది జిల్లాలో 55 హత్యలు, 88 కిడ్నాపులు, 131 అత్యాచారాలు చోటుచేసుకున్నాయి. ఇందులో కుట్రపూరితమైనవి, ఆస్తి కోసం, కక్షసాధింపు కోసం చేసినవే ఎక్కువగా ఉన్నాయి.

దొంగతనాలు.. సైబర్ నేరాల జోరు

హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న జిల్లాలో దొంగల బెడద తీవ్రంగా ఉంది. అంతర్‌రాష్ట్ర ముఠాల సంచారం ఎక్కువైంది. జాతీయ రహదారులు, రైలు మార్గాలు, సరిహద్దుల గుండా దొంగలు వచ్చి దోపిడీలకు పాల్పడి

మిగతా 8వ పేజీలో





కలెక్టర్ క్రాంతి, ప్రధాన న్యాయాధికారి భవానీచంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ పరితోష్

సివిల్ తగాదాల్లో తలదూర్చొద్దు

పోలీసులకు కొత్త ఎస్పీ పరితోష్ సూచన

సంగారెడ్డి క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా ఎస్పీగా పరితోష్ పంకజ్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన స్వస్థలం బీహార్ రాష్ట్రం బోజ్‌పూర్ జిల్లా ఆరా పట్టణం. గతంలో భద్రాచలం అదనపు ఎస్పీగా, భద్రాద్రి కొత్తగూడెం ఓఎస్డీగా పనిచేశారు. యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా బదిలీ అయిన చెన్నూరి రూపేష్ కొత్త ఎస్పీకి బాధ్యతలు అప్పగించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతిని, జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్రను ఎస్పీ పంకజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికితేవాలని సూచించారు. పోలీసులు సివిల్ తగాదాల్లో తలదూర్చకూడదని, చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, ఏవో కళ్యాణి, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, సత్యయ్యగౌడ్, రామ్‌మోహన్ రెడ్డి, వెంకట రెడ్డి, సురేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రూపేష్‌కు అధికారుల వీడ్కోలు 7లో

అంగట్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు!

ఒక్కో ఫ్లాట్‌కు రూ. 3లక్షల నుంచి రూ. 6లక్షలు

నోటరీ ద్వారా విక్రయాలు ● ఒప్పందం కుదురుస్తున్న దళారులు



ఫసల్‌వాదిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం

సంగారెడ్డి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించింది. అర్బన్ ఏరియాల్లో అపార్ట్‌మెంట్ల రూపంలో నిర్మించింది. ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముకుంటున్నారు. కొంతమంది కమిషన్ ఏజెంట్లు మధ్యవర్తిత్వం వహిస్తూ నోటరీపై విక్రయిస్తున్నారు. సర్కారు కేటాయించిన ఇళ్లను అమ్మడం, కొనడం నేరమని తెలిసినా కొందరు విక్రయిస్తున్నారు.

రూ.14.04కోట్లతో 265 ఇళ్లు

జిల్లాకేంద్రమైన సంగారెడ్డి సమీపంలోని ఫసల్‌వాది గ్రామ శివారులో రెండేళ్ల క్రితం రూ.14.04 కోట్లతో బహుళ అంతస్థుల్లో 265 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన 150 మందికి, ఫసల్‌వాదికి చెందిన 65 మందికి, కులబ్‌గూర్‌కు చెందిన 50 మందికి కేటాయించారు. కానీ, పలువురు లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లను అమ్ముకుంటున్నట్లు తెలిసింది. కొంతమంది ఏజెంట్లు కొనుగోలుదారులు అమ్మకందారుల మధ్యవర్తిత్వం చేసి రూ.3లక్షల నుంచి రూ.6లక్షలకు ఒప్పందం కుదురుస్తున్నారు. మరికొంతమంది లబ్ధిదారులకు ఫ్లాట్లలో ఉండలేక అద్దెకు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను విక్రయిస్తే తిరిగి స్వాధీనం చేసుకొని లబ్ధిదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

అటవీ జంతువుల దాహం.. దాహం

నీళ్లు లేక.. చెత్త చేరిన సాసర్ పిట్లు

అల్లాడుతున్న వన్యప్రాణులు 7



ఇద్దరు బల్దియా సిబ్బంది సస్పెన్షన్

సంగారెడ్డి కమిషనర్, సదాశివపేట మేనేజర్ సహా 15 మందికి షోకాజ్

సదాశివపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు మున్సిపల్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు మరో 17మందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ సోమవారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జహీరాబాద్ బల్దియా బిల్ కలెక్టర్ ఖుర్షీద్ మహ్మద్, సదాశివపేట బల్దియా బిల్ కలెక్టర్ శ్రీకాంత్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. వీరితో పాటు జిల్లాలో పలు మున్సిపాల్టీలకు చెందిన 17 మంది సిబ్బందికి కలెక్టర్ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో సదాశివపేట మున్సిపల్ మేనేజర్ ఉమేందర్, బిల్ కలెక్టర్ అనీల్, జహీరాబాద్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంజీవ్, బిల్ కలెక్టర్ సాయిస్వరాజ్, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, బిల్ కలెక్టర్‌లు ప్రశాంత్, సోహేల్, హరి, ఇక్బాల్, తెల్లాపూర్ బిల్ కలెక్టర్ రామకృష్ణ ఉన్నారు. అధికారులు, సిబ్బంది పనితీరులో మార్పు రాకుంటే కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు. ఈ నెల చివరి నాటికి 100 శాతం ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు వసూలు చేసేలా జిల్లాలోని మున్సిపాల్టీల కమిషనర్లు ప్రతిరోజూ సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ పన్నుల వసూళ్లల్లో వేగం పెంచాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాలు జారీ చేశారు.

కోడికి ఏమైంది?

అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు మృత్యువాత

దాణా పెట్టకపోవడమే కారణమంటున్న వెటర్నరీ అధికారులు

అమ్మకాలు లేక చికెన్ సెంటర్లు వెలవెల

- కౌడిపల్లి మండలం కంచన్‌పల్లిలోని పౌల్ట్రీ ఫాంలో రెండ్రోజుల వ్యవధిలో 5వేల కోళ్లు మృతిచెందాయి. యజమాని రామకృష్ణగౌడ్‌కు లక్ష రూపాయల నష్టం వాటిల్లింది.
- కౌడిపల్లి మండలం బూర్గుగడ్డలో 5వేల కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృతిచెందాయి. యజమాని లింబాద్రికి రూ. లక్ష నష్టం వాటిల్లింది. ఇదే మండలం సదాశివపల్లిలో కొప్పుల నారాయణకు చెందిన 5వేల కోళ్లు మృతిచెందగా రూ. లక్ష నష్టంతో పాటు పూడ్చిపెట్టడానికి యజమాని మరో రూ. 20 వేల ఖర్చు భరించల్సివచ్చింది.
- కొల్చారం మండలం నాయిని జలాలపూర్‌లో రెండ్రోజుల వ్యవధిలో సత్యనారాయణగౌడ్‌కు చెందిన కోళ్లఫారంలో 5 వేల కోళ్లు మృతిచెందాయి.
- నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో 3,500 నాటు కోళ్లు మృతిచెందాయి. రూ.8 లక్షల వరకు ఖర్చయిందని రైతు ప్రసాద్ పేర్కొన్నాడు. ప్రక్కనే బ్రాయిలర్ కోళ్లఫారం ఉండడంతో వాటికి వచ్చిన రోగమే ఈ నాటు కోళ్లకు అంటుకున్నదని అనుమానం వ్యక్తం చేశాడు.
- చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి, జంగరాయి గ్రామాల్లో 10వేల కోళ్లు చనిపోయాయి. రైతులకు సుమారు రూ.2లక్షల నష్టం జరిగింది.
- నిజాంపేట మండలం ఖాసీంపూర్ తండా శివార్లలోని పౌల్ట్రీఫాంలో వందల సంఖ్యలో కోళ్లు మృతిచెందాయి.
- శివంపేట మండలం గూడూరులో 4వేల కోళ్లు మృతిచెందాయి.



కంచన్‌పల్లిలో మృతిచెందిన కోళ్లు

మెదక్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. కష్టపడి పెంచిన కోళ్లకు మాయదారి రోగంసోకి గిరగిరా తిరుగుతూ కాళ్లు కొట్టుకుంటూ చనిపోతుంటే రైతుల గుండె తరుక్కుపోతోంది. రోజుకో చోట గుంపులుగా వందలు వేలుగా కోళ్లు చనిపోతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. నిరుద్యోగ యువత స్వయంఉపాధిలో భాగంగా కోళ్ల ఫారాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు వంద పైచిలుకు పౌల్ట్రీఫారాలు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాచుకు 5వేల కోళ్ల చొప్పున కోళ్లను పెంచుతారు. సాధారణంగా ఒక్కో కోడిపిల్ల ధర రూ.50 వరకూ ఉంటుంది. 45 రోజుల పాటు మేత రూపంలో రూ.160 వరకు ఖర్చవుతుంది. అదనంగా వాటిని వ్యాక్సిన్లు, మందులు ఇవ్వాల్సి ఉంటుంది. విద్యుత్‌చార్జీలు, కూలీల వేతనం చెల్లించాల్సి ఉంటుంది. నిర్వహణ భారం పెరిగిపోవడంతో రైతులు కుంగిపోతున్నారు.

దాణా ఇవ్వకపోవడమే కారణం..

పక్క రాష్ట్రాల్లో మాదిరిగానే బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుండడం మూలంగానే మూకుమ్మడిగా కోళ్లు మృతి చెందుతున్నాయని పౌల్ట్రీ రైతులు వాపోతుండగా.. పశుసంవర్ధకశాఖ అధికారులు, పశు వైద్యుల వాదన మరోరకంగా ఉంది. కోళ్లకు వైరస్ సోకినట్లు ఇంతవరకూ నిర్ధారణ కాలేదని, మృతిచెందిన కోళ్ల శాంపిళ్లను మధ్యప్రదేశ్‌లోని ల్యాబ్‌కు పంపినా నివేదిక రాలేదని చెబుతున్నారు. చచ్చే కోళ్లపై ఖర్చు ఎందుకని వాటికి దాణా ఇవ్వడమే మానేయడంతో పెద్దసంఖ్యలో చనిపోతున్నాయని విశ్లేషిస్తున్నారు.

60 శాతం తగ్గిన చికెన్ విక్రయాలు

కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతుండడంతో చికెన్ తినేవారు తగ్గిపోయారని చికెన్‌షాపుల యజమానులు వాపోతున్నారు. మెదక్ జిల్లాకేంద్రంలోనే ప్రతీరోజు సుమారు రెండు టన్నుల చికెన్ విక్రయాలు జరుగుతుంటాయి. అయితే, పదిహేను రోజుల నుంచి ఏడెనిమిది క్వింటాళ్లకు మించి కోడి మాంసం అమ్మకాలు జరగడం లేదని చికెన్‌షాపు యజమాని మురళి తెలిపారు. పైగా ధరలు అమాంతం పడిపోయాయి. జనవరి నెలలో కిలో చికెన్ ధర రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.150కు పడిపోయింది. దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదని చికెన్ సెంటర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ కాలేదు



జిల్లాలో మృతిచెందిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకినట్లు ఇంకా నిర్ధారణ కాలేదు. బయో సెక్యూరిటీ మెజర్‌మెంట్స్ పాటించాలని పౌల్ట్రీ యజమానులకు సూచించాం. మా విచారణలో కొన్ని చోట్ల కోళ్లకు ఫీడింగ్ ఇవ్వనట్లు తెలుస్తోంది. ఆకలికి అల్లాడి, ఎండ భరించలేక కోళ్లు సామూహికంగా చనిపోతున్నట్లు తెలుస్తున్నది. ఆరోగ్యకరమైన చికెన్ ఆరగించడంతో ఎలాంటి హాని జరగదు.

-డాక్టర్ వెంకటయ్య, మెదక్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

రంజాన్ వేళలు


మంగళవారం ఇఫ్తార్: సాయంత్రం 6.30

బుధవారం సహర్: ఉదయం 5.05

'ఎల్‌ఆర్‌ఎస్' 31 లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ

దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వండి

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు మార్చు 31వ తేదీలోగా ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని ఆడిటోరియంలో ఆమె సంబంధిత అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. జీవో నెంబర్ 131 మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లు, లేఔట్లలో ఉన్న దరఖాస్తుదారులకు ఫోన్ చేసి నూతన విధానంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇపటివరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

ఖేడ్‌లో విజిలెన్స్ అధికారుల దాడి

● 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచిన గోదాంపై సోమవారం విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 60 బస్తాల్లో ఉన్న 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశం వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణంలోని రాయిపల్లి రోడ్డులో శివరాం అనే బియ్యం వ్యాపారి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తన దుకాణం వెనుక గోదాంలో నిల్వచేశాడు. పక్కా సమాచారం అందుకున్న డీఎస్పీ సీఐ పండరీ, ఎస్‌ఐ వెంకటేశం, తహసీల్దార్ ప్రభాకర్‌తో కలిసి దాడిచేసి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామన్నారు. ఆర్‌ఐ మాధవరెడ్డి ద్వారా పంచనామా చేయించి బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి, నారాయణఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించామన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి నిరసన

● ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం



ప్రియుడి ఇంటి ఎదుట నిరసన తెలియజేస్తున్న దివ్య

కౌడిపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 10 : ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు సోమవారం నిరసన చేపట్టింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన జజ్జరి దివ్య, ఇదే గ్రామానికి చెందిన గొల్ల అనిల్ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే గతేడాది మార్చిలో కొల్చారం మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడితో దివ్యకు వివాహమైంది. ఇది జీర్ణించుకోలేని అనిల్ 'నువ్వు లేక నేను ఉండలేను.. పెళ్లి చేసుకుంటానని దివ్య ఫోన్‌కు తరచూ మెసేజ్‌లు చేసేవాడు. ఈ విషయం గమనించిన భర్త దివ్యకు విడాకులు ఇచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చిన దివ్య పెళ్లి చేసుకోవాలని పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించింది. రూ.20 లక్షల కట్నం, ఎకరం పొలం ఇస్తే పెళ్లి చేసుకుంటానని అనిల్ డిమాండ్ చేశాడు. దివ్య తల్లి కట్నం ఇస్తాము.. పెళ్లి చేసుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. కొన్ని రోజులుగా నేనే మీకు రూ.26 లక్షలు పరిహారంగా ఇస్తాను.. కానీ పెళ్లి చేసుకోనని మొహం చాటేసి బంధువుల వద్ద ఉంటున్నాడు. ఆదివారం అనిల్ ఇంటికి వచ్చాడని సమాచారం తెలుసుకున్న దివ్య తల్లితో కలిసి సోమవారం అనిల్ ఇంటికెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. అనిల్ తల్లి భాగ్యమ్మ దివ్యపై దాడిచేసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. తనకు అనిల్‌తో వివాహం చేయాలని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని దివ్య ప్రియుడి ఇంటి ఎదుట నిరసనకు దిగింది. ఈ విషయమై గతంలో పలు మార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జోగిపేట రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న చెట్లకింద ముగ్గురు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో దాడులు జరిపామని తెలిపారు. వీరి నుంచి రూ.16,250 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ప్రజావాణి'కి 57 దరఖాస్తులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి/గుమ్మడిదల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం జిల్లాలోని నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు 57 అర్జీలు సమర్పించారు. రెవెన్యూశాఖ 25, సర్వే ల్యాండ్ 7, పౌర సరఫరాల శాఖ 2, మార్క్‌ఫెడ్ 1, పంచాయతీ అండ్ పీటీ విభాగం 4, పంచాయతీరాజ్ 2, మునిసిపల్ 4, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 9, విద్యాశాఖ 2, వ్యవసాయశాఖ 1 చొప్పున దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ ప్యారానగర్ శివారులో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతారని, వాటిని దృష్టిలో పెట్టుకుని డంపింగ్‌యార్డు నిర్మాణాలు ఆపాలని కలెక్టర్ వల్లూరు క్రాంతికి గుమ్మడిదల జేఏసీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పారు.

ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి: మెదక్ కలెక్టర్



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చే అర్జీలకు గుణాత్మక పరిష్కారం చూపాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 60 వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొడుకులు అన్నం పెట్టడం లేదని వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన దేశి కొమురయ్య, శివలక్ష్మి కలెక్టర్ ఎదుట వాపోయారు. వెంటనే స్పందించిన కలెక్టర్ బాధిత తల్లిదండ్రులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డిని ఆదేశించారు. అలాగే భూ సమస్య పరిష్కరించడం లేదని హవేళీఘణపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేందర్ సోమవారం మెదక్ కలెక్టరేట్ భవనం ఎక్కి హల్‌చల్ చేశాడు. తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం దక్కడం లేదని సురేందర్ వాపోయాడు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ నగేష్ సురేందర్‌కు నచ్చజెప్పడంతో కిందికి దిగాడు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● హత్యగా అనుమానం





డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు, వినోద్‌రెడ్డి(ఫైల్)

పాపన్నపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తొగర్‌పల్లికి చెందిన గొరెల్లి వినోద్‌రెడ్డి(33) వంట పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 7న ఇంట్లోంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. ఈ క్రమంలో సోమవారం ఏడుపాయల అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకుని వినోద్‌రెడ్డిగా గుర్తించారు. తలకు బలమైన గాయం ఉండడంతో మృతుడి అన్న హత్యగా అనుమానం వ్యక్తం చేశాడు. మృతుడి అన్న విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంట్లోంచి వెళ్లి శవమయ్యాడు



నరసింహచారి (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రెండునెలల క్రితం ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నరసింహచారి(53) మతి స్థిమితం తప్పి జనవరి 8న రాత్రి ఇంటినుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈనెల 9న కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం శివరామపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరికి నరసింహచారి చెట్టుకు ఉరేసుకుని కుళ్లిన స్థితిలో కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలపగా.. వారు నరసింహచారి బంధువులతో పాటు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి అక్కడే పంచానామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రాజమణి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



కిరణ్(ఫైల్)

జగదేవ్‌పూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పని చేయకుండా జులాయిగా తిరుగుతున్న తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొడకండ్ల సత్తయ్య, అమృత దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు కిరణ్ (20) గ్రామంలో హౌజ్ వైరింగ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తాడు. అయితే కొద్దిరోజులుగా కిరణ్ పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఆదివారం తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన కిరణ్ సోమవారం జగదేవ్‌పూర్ సమీపంలోని కాళేశ్వరం కెనాల్ పక్కనున్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా తన స్నేహితులకు ఫోన్‌చేసి నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వారు వద్దని వారించినా వినలేదు. సోమవారం తోటి మిత్రులు వెళ్లే సరికి కిరణ్ చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఎస్‌ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

● నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.30 వేల జరిమానా

చేగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలుతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ మెదక్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయాధికారి పీ.లక్ష్మీశారద తీర్పు వెల్లడించారని చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిట్టోజిపల్లి గ్రామానికి చెందిన చలిమేడ సురేష్ ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కింద కేసు నమోదైంది. సోమవారం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలుతో పాటు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పాపను ఎత్తుకెళ్లేందుకు యత్నం

మనోహరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రం నుంచి పాపను ఎత్తుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించిన సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధి కాళ్లకల్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. కాళ్లకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-2కు మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బాలిక(5)ని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అంగన్‌వాడీ టీచర్ అరవడంతో దుండగుడు పారిపోతుండగా గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమ్మర్.. బీ కేర్ ఫుల్

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.. వడదెబ్బ తగలకుండా చూసుకుందాం



మెదక్ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. వాతావరణం రోజురోజుకూ నిప్పుల కొలిమిలా మారుతోంది. ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి 39 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు ఇంకా పెరుగుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో వేసవి కాలంలో ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అత్యవసర పనులపై బయటికి వెళ్లే వారు వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు కనింపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు..

- తెలుపు రంగు, పలుచటి కాటన్ దుస్తులు ధరించాలి
- బయటకు వెళ్లే ముందు తలకు టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉప్పు కలిపినా మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలి
- ఓరల్ రీ హైడ్రేషన్ కలిపిన నీటిని తాగవచ్చు.
- వడ దెబ్బ తగిలిన వారిని వెంటనే చల్లటి ప్రాంతానికి తీసుకెళ్లాలి

వడదెబ్బ లక్షణాలు

తలనొప్పి, తల తిరగడం
తీవ్రమైన జ్వరం
మత్తునిద్ర, కలవరింతలు, మూర్ఛ
కొంచెం లేదా పూర్తిగా
అపస్మారక స్థితిలోకి వెళ్లడం

చర్మం పాడవకుండా

- మాములు రోజుల కంటే ఒక లీటర్ నీరు ఎక్కువగా తాగాలి.
- చర్మం పొడిబారకుండా చూసుకోవాలి. డి హైడ్రేషన్ గురికాకుండా శరీరంలో తేమ కోల్పోకుండా చూసుకోవాలి.
- ఎండలోకి వెళ్లేముందు రోజ్ నీటిని ముఖానికి పూసుకుంటే మంచిది.
- నీటితో కలిపిన మాయిశ్చరైజింగ్ క్రిమ్‌ను పూసుకోవాలి.
- ముఖాన్ని ఎక్కువ సార్లు సబ్బుతో కడగ కూడదు.
- వీలైనన్నిసార్లు చల్లటి నీటితో కడుకోవడం మంచిది.

- వడ దెబ్బకు గురి అయిన వారిని తడి వస్త్రంతో శరీరం అంత తుడుస్తూ ఉండాలి
- ఐస్ నీటిలో వస్త్రాన్ని ముంచి శరీరం అంత తుడవాలి. శరీర ఉష్ణోగ్రత 101 ఫారన్‌హీట్ డిగ్రీల కంటే తక్కువ అయ్యేంత వరకు తూడుస్తూ ఉండాలి.
- వడ దెబ్బకు గురి అయినవారు సాధారణ స్థితికి రాకపోతే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి
- మంచినీరు ఎక్కువ సార్లు తాగుతుండాలి
- ఎండలో నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం లేదా కొబ్బరినీరు, చల్లనినీరు తాగాలి
- తీవ్రమైన ఎండలో బయటికి వెళ్లినప్పుడు తల తిరుగుడు, ఇతర సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

చేయకూడనివి..

- సూర్యకిరణాలకు, వేడి గాలికి గురి కాకూడదు.
- ఎండ బాగా ఉంటే గొడుగు తీసుకెళ్లడం ఉత్తమం
- నలుపు, మందంగా ఉన్న దుస్తులు వేసుకోకూడదు.
- వడ దెబ్బకు గురి అయిన వారిని వేడి నీటిలో ముంచిన వస్త్రంతో తుడవకూడదు
- ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఆలస్యం చేయకూడదు
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఎండలో వెళ్లకుండా చూసుకోవాలి. ఒక వేళ వెళ్లవలిసి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండలో నుంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు.. తేనె వంటివి తీసుకోకూడదు.
- శీతల పానీయాలు, మంచు ముక్కలు వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు రావచ్చు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి



ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకొని అవసరమైతేనే బయటకు వెళ్లాలి. దూర ప్రయాణాలు మానుకోవాలి. తరచూ నీళ్ల తాగాలి. వాంతులు, విరేచనాలు ఉంటే వైద్యం తీయనుకోవాలి. అలసత్వం చేస్తే కొన్నిసార్లు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ శివదయాల్,
జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త, మెదక్

పండు.. ఆరోగ్యం దండు



హుస్నాబాద్‌లో పండ్ల కొనుగోలు

హుస్నాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం నుంచి బయటపడేందుకు పండ్లు, పండ్ల రసాలు ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత మంచిది. పండ్లను తీసుకోవడం వల్ల కూడా వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి అధికశాతం నీరు చెమట రూపంలో బయటకు పోతుంది. దీనివల్ల శరీరంలో లవణాలు కోల్పోయి నిరసం వస్తుంటుంది. వీటి నుంచి మనకు మనం రక్షించుకోవడానికి పండ్ల రసాలు ఎంతో మేలు చేస్తాయి. ఇప్పటికే పలు చోట్ల పెద్ద ఎత్తున జ్యూస్ సెంటర్లు వెలిశాయి. వేసవిలో లభించే పండ్లను వాహనాల్లో తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. వీటి పట్ల ప్రజలు అసక్తి చూపుతున్నారు.

- నిమ్మరసం ఆరోగ్యానికి ఎంతో ఎంతో మేలు చేస్తుంది. ఇందులో విటమిన్ సి కలిగి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
- కీరదోస వేసవిలో రీహైడ్రెటింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. చెమట ద్వారా కోల్పోయిన నీటిని, లవణాలను శరీరానికి తిరిగి అందించడంలో చక్కని పాత్ర పోషిస్తుంది.
- ద్రాక్ష శరీరంలో వేడి, నిరసాన్ని తగ్గిస్తుంది.
- వేసవిలో కొబ్బరిబోండాం ఎంతో శక్తినిస్తుంది. పిల్లలను ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగ పడుతాయి.
- తర్బూజ శరీరంలోని వేడిని తీసి వేస్తుంది. ఇందులో 95.9 శాతం నీరు ఉంటుంది. వేసవిలో చెమటరూపంలో బయటకు వెళ్లే నీటిని తిరిగి పొందేందుకు తోడ్పడుతుంది.
- పుచ్చకాయ(వాటర్ మిలన్) అధిక శాతం నీరు ఉంటుంది. ఇది వేసవిలో దాహార్తిని తీర్చుతుంది.
- చెరుకు రసం వేసవిలో ఆరోగ్యానికి

ఉద్యోగాలు ఇచ్చేవారిలా ఎదగండి

వర్ధమాన ఇంజనీర్లకు ఫైటెక్ ఎంబెడెడ్ డైరెక్టర్ ఉద్బోధ



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అరుణ కుమార్

పటాన్‌చెరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన ఇంజనీర్లు ఉద్యోగాల కోసం చూడకుండా, ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని ఫైటెక్ ఎంబెడెడ్ సేల్స్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ సింగ్ ఉద్బోధించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ఐఐవోటీ ధోరణులు, ఆవిష్కరణలు' అనే అంశంపై నిర్వహిస్తున్న అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్‌డీపీ) సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇంజనీర్లు కేవలం సేవ చేసే వారు మాత్రమే కాదని, వారు కొత్త అవకాశాలు, ఉద్యోగ సృష్టికర్తలని అభివర్ణించారు. దేశం సాఫ్ట్‌వేర్ రంగంలో ముందున్నప్పటికీ, స్వదేశీ హార్డ్‌వేర్ లేదని.. ఎన్నో బహుళ జాతి కంపెనీలకు భారతీయులు నేతృత్వం వహిస్తున్నప్పటికీ, మనదైన విశ్వశ్రేణి ఉత్పత్తులు పెద్దగాలేవని విచారం వెలిబుచ్చారు. ఫైటెక్ ఎంబెడెడ్‌లో లెక్కలేనన్ని వినూత్న ఉత్పత్తుల రూపకల్పన చేయగల మైక్రోప్రాసెసర్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి మాట్లాడుతూ ఫైటెక్ ఎంబెడెడ్, గీతం మధ్య సహకారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ అవగాహనతో గీతం విద్యార్థులకు సాంకేతికత బదిలీ, ఇంటర్న్ షిప్‌లు, ప్రాంగణ నియామకాలకు మార్గం సుగమం చేస్తుందని అభిలషించారు. ఫైటెక్‌తో అవగాహనా ఒప్పందంపై సంతకం చేయబోతున్నట్టు డాక్టర్ శాస్త్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, ఎఫ్‌డీపీ నిర్వాహకుడు ప్రొఫెసర్ పి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాంల పరిశీలన



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ వే ఆఫ్ ముంబై సంస్థ ప్రిన్స్ పైప్స్ సహకారంతో జలసంజీవని విలేజ్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం కింద మండలం గైర్యాన్‌తండా, సీతారాంతండా శివార్లలో ఒక్కో చెక్‌డ్యాంలతో పాటు చాప్టాకె శివారులో మరో చెక్ డ్యాంను ఇటీవలే నిర్మించింది. సోమవారం సంస్థ జిల్లా మేనేజర్ శివరాజ్‌నాయక్, ఇన్‌చార్జి అజీజ్ టొంబాలి, ఇంజనీర్ కృష్ణ, క్షేత్ర అధికారులు శ్రీకాంత్, ప్రియాంక పరిశీలించారు. తమ సంస్థ ద్వారా భూగర్భజలాల పెంపుదల, వాన నీటి సంరక్షణ, వ్యవసాయ ఉత్పాదకతను ప్రోత్సహించడంలో భాగంగా మల్టిలేయర్ ఫార్మింగ్, ఆగ్రో హర్టికల్చర్, నర్సరీలు, ఫాంపాడ్‌ల నిర్మాణం తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యావిభాగం ద్వారా చాప్టాకె, అబ్బెంద ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను నిర్మించినట్లు వివరించారు.

చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

క్రికెట్ అకాడమీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్



మాట్లాడుతున్న క్రికెట్ అకాడమీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్

మునిపల్లి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత తరుణంలో చదువు ఒక్కటే ముఖ్యం కాదని, క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెటర్, క్రికెట్ అకాడమీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ శివారులోని వోక్సెన్ వర్సిటీలో నూతనంగా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయనున్న సందర్భంగా సోమవారం యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు స్థలం అనువుగా ఉందన్నారు. ప్రతిభావంతులైన ఆటగాళ్లను భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి కెరీర్ ప్రారంభంలోనే అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో శిక్షణా కేంద్రాలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకవచ్చేందుకు ఈ అకాడమీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంతకు ముందు చాంపియన్ ట్రోఫీలో న్యూజిలాండ్‌పై భారత్ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ అధ్యాపకుడు విశాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కోవర్టులను తరిమేస్తాం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

సిద్దిపేట టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఉంటూ బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉంటున్న కోవర్టులను గుర్తించి పార్టీ నుంచి తరిమేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. సోమవారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీలో అనుకోకుండా ప్రమాదం జరిగితే ఇష్టనుసారంగా మాట్లాడుతున్న కల్వకుంట్ల కుటుంబం రంగనాయకసాగర్ టన్నెల్‌లో ప్రమాదం జరిగితే, మాసాయిపేట రైల్వే ఘటనలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కొందరు అధికారులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని అలాంటి వారు ఇకనైనా మారి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకవచ్చేందుకు కృషిచేయాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్ల రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినప్పుడే ఆ పార్టీ దుకాణం బంద్ అయిపోయిందని చెప్పానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని మీరు ఎంత అవమానిస్తున్నా, ఓర్పు, సహనంతో చాలెంజింగ్‌గా ముందుకు వెళ్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నేరువేరుస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తలంతా సమష్టిగా పనిచేయాలని, స్థానిక సంస్థలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీ లైన్ దాటి, బీఆర్ఎస్‌కు పనిచేస్తున్నట్లు నిర్ధారణకు వస్తే మాత్రం త్వరలోనే దేవాలయాల్లో పసుపు బియ్యం ఎత్తేలా, చర్చి, మసీదులలో ప్రమాణాలు చేసే కార్యక్రమం పెట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, నర్సారెడ్డి, తాడూరి శ్రీనివాస్, గూడూరి శ్రీనివాస్, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, రియాజుద్దీన్, గోపికృష్ణ, గయాసుద్దీన్, ఆలకుంట మహేందర్, వాహబ్, రాషాద్, గ్యాదరి మధు, అర్షద్, వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇద్దరు టీచర్లపై సస్పెన్షన్ వేటు

కంగ్టి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): కంగ్టి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలను చితక బాదిన ఘటనలో ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేస్తూ డీఈఓ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు వారిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు వివరించారు. కస్తూర్బా విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న రిష అనే బాలికతో పాటు మరో నలుగురు బాలికలు మొక్కలకు నీరు పోయలేదనే సాకుతో గణతం టీచర్ సురేఖ తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన జీసీడీఓ సుప్రియ ఇచ్చిన నివేదిక మేరకు గణితం టీచర్ సురేఖతోపాటు పీఈటీ రేణులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కేజీబీవీ ఎస్‌వో విజయలక్ష్మి తెలిపారు.

అటవీ జంతువుల దాహం.. దాహం

నీళ్లు లేక.. చెత్త చేరిన సాసర్ పిట్లు



చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో చెత్తచెదారంతో నిండిన సాసర్‌పిట్

శివ్వంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ ప్రాంతంలో వేల రూపాయలు వెచ్చించి నిర్మించిన సాసర్ పిట్లు నిరుపయోగంగా మారాయి. నీళ్లు లేక చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో అటవీ జంతువులు, వన్యప్రాణులు దాహార్తితో అలమటిస్తున్నాయి. నర్సాపూర్ రేంజ్ పరిధి మండలంలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు పలు చోట్ల సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. వీటిల్లో నిత్యం నీరు పోసేలా అటవీశాఖ నిధులు మంజూరు చేసింది. అయితే, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో వీటిలో నీరు పోసే నాథుడు లేకుండా పోయారు. దీంతో అవి నిరూపయోగంగా మారాయి. అడవుల్లో ఏర్పాటు చేసిన ఈ నీటి తొట్లలో నీరు లేక నెమళ్లు సమీపంలోని పొలాల్లోకి వచ్చి విషపూరితమైన నీటిని తాగి మృతి చెందుతున్నాయి. ఈ విషయమై మెదక్ డీఎఫ్‌వో జోజిని సంప్రదించగా.. వేసవి కాలంలో వన్యప్రాణులకు నీటిని ఏర్పాటు చేసేందుకు నిధులు వచ్చాయని, ఈ సంవత్సరం నిధుల కొరతతో మంజూరు కాలేవని తెలిపారు.

ఎస్పీ రూపేష్‌కు అధికారుల వీడ్కోలు



ఎస్పీ రూపేష్ ఉన్న వాహనాన్ని తాడుతో లాగుతున్న పోలీసు అధికారులు

సంగారెడ్డి క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నుంచి బదిలీ అయిన ఎస్పీ చెన్నూరి రూపేష్‌కు జిల్లా పోలీసులు, సిబ్బంది సోమవారం ప్రేమ పూర్వక వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో విధాయిపరేడ్ నిర్వహించారు. అనంతరం గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాతో తనకున్న అనుబంధం ఎన్నటికీ మరువలేనని అన్నారు. అధికారులను, సిబ్బందిని ఎవరినైనా మందలిస్తే, అది విధుల్లో భాగమేనని గుర్తించాలన్నారు. అనంతరం పూలతో అలంకరించిన పోలీస్ వాహనంలో రూపేష్ కుటుంబ సభ్యులను పెరేడ్‌గ్రౌండ్స్ నుంచి కార్యాలయ ఆవరణ వరకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఏఆర్ డీఎస్పీ నరేందర్ పాల్గొన్నారు.

మెదక్‌కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

రూ.200 కోట్లు మంజూరు
25 ఎకరాల స్థల సేకరణ కోసం కసరత్తు
అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. స్కూల్ నిర్మాణం కోసం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేస్తూ.. పరిపాలన అనుముతులు జారీ అయ్యాయని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు.

జిల్లా కేంద్రమైన మెదక్‌తోపాటు రామాయంపేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే రెండు చోట్లు స్థలాలలను గుర్తించినట్లు తెలుస్తోంది. దాదాపు 25 ఎకరాల ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణం చేసేందుకు పరిశీలన జరుగుతోంది. ఈ రెండు స్థలాలకు సంబంధించిన వివరాలను రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లాలో చాలా గురుకులాలకు శాశ్వత భవనాలు లేవు. సగానికిపైగా గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పక్కా భవనం లేనప్పుడు బోధన, అభ్యసన కార్యక్రమాల అమలు ఇబ్బందికరంగా ఉంటుంది. దీనికి దృష్టిలో పెట్టుకొని బడుగు, బలహీన, మైనార్టీల వర్గాలకు ఒకే గొడుగు కిందకు తెచ్చి చదువు చెప్పించే లక్ష్యంతో సమీకృత అంతర్జాతీయ ప్రమాణాలతో భవనం నిర్మించనున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్కూల్ నిర్మాణం జరపనున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే ప్రాంతంలో దాదాపు పాతికేళ్ల క్రితం నుంచి అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షాపాతం, చలి, వేడి గాలుల తీవ్రత తదితర వాతావరణ అంశాలను పరిశీలించి నిర్మించనున్నారు. విద్యార్థులకే కాకుండా బోధన, బోధనేతర సిబ్బందికి అక్కడే క్వార్టర్స్ నిర్మిస్తారు.

5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలన్నీ ఒకే ప్రాంగణంలోకి వస్తాయి. 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులుంటారు. అంతర్జాతీయ ప్రామాణాలతో ఇంగ్లిష్ మీడియం 12వ తరగతి వరకు బోధన అందించనున్నారు. ఈ స్కూల్‌లో సుమారు 2,560 మంది విద్యార్థులకు బోధన అందించే అవకాశం ఉంది. ఈ పాఠశాలల్లో వేర్వేరు బ్లాక్‌లు ఉండనున్నాయి. ప్రతీ స్కేల్‌లో 30 మంది చొప్పున 120 మంది ఉపాధ్యాయులు పని చేయనున్నారు. లైబ్రరీలో దాదాపు 5 వేల పుస్తకాలు, 60 కంప్యూటర్లు ఉండనున్నాయి. అన్ని తరగతుల్లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధనలు చేయనున్నారు. ప్రతీ డార్మింటరీ గదిలో 10 బెడ్లు, రెండు బాత్‌రూంలు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ స్కూల్‌లో చదువుల పేరిట ఒత్తిడి సృష్టించే వాతావరణం కాకుండా క్రీడలు, వినోదం వంటివి కూడా విద్యార్థులకు అందించనున్నారు. ఇండోర్ స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదనాలు, బాస్కెట్ బాల్ మైదానం, అవుట్‌డోర్ జీమ్, థియేటర్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతోనే..



నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైంది. సీఎం రేవంత్‌రెడ్డి సహకారాలతోనే మెదక్‌కు స్కూల్ కల సాకారం కానుంది. దాదాపు 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనం నిర్మాణం జరపాలని యోచిస్తున్నాం. ఇందుకు అనుగుణంగా చర్యలు ప్రారంభించాం. మెదక్ లాంటి వెనుక బడిన నియోజకవర్గంలో విద్యకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశా రు. స్థల సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరాం. స్థలం కేటాయించగానే సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తాం.

- డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు, మెదక్ ఎమ్మెల్యే

అదుపు తప్పి.. పాఠశాల బస్సు బోల్తా

ఐదుగురు విద్యార్థులకు గాయాలు



కొండెంగలకుంట శివారులో బోల్తా పడిన పాఠశాల బస్సు

చిన్నకోడూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపు తప్పి బోల్తా పడగా, అందులో ఉన్న ఐదుగురు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని కమ్మర్లపల్లి గ్రామపంచాయతీ పరిధి కొండెంగలకుంట వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండెంగలకుంటలో సోమవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని రావూస్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను దింపేందుకు సోమవారం సాయంత్రం మండలంలోని సలేంద్రి నుంచి కొండెంగలకుంటకు వెళ్తుంది. ఈ క్రమంలో కొండెంగలకుంటకు వెళ్లే రోడ్డులో మలుపు వద్ద అజాగ్రత్తగా, అతివేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వరి పొలంలో బోల్తా పడింది. దీనితో బస్సులో ఉన్న కొండెంగలకుంటకు చెందిన ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తీవ్ర గాయాలైన అన్విత్‌తోపాటు స్వల్ప గాయాలైన శ్రీహన్, వినయ్‌ను సిద్దిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు. రెగ్యులర్‌గా వచ్చే బస్సు డ్రైవర్ రాకపోవడంతో కొత్త డ్రైవర్ బస్సు నడపడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యేకు ఖురాన్ అందజేత

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ముస్లిం యాక్షన్ కమిటీ బాధ్యులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డికి తెలుగులో అనువాదం చేసిన ఖురాన్ షరీఫ్ పుస్తకాన్ని అందజేశారు. అంతకుముందు ఆయనతో సమావేశమైన వారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు ఖేడ్ పట్టణంలో మరో ముస్లిం శ్మశాన వాటిక ఏర్పాటుతో పాటు అన్ని హంగులతో షాదీఖానాను నిర్మించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కమిటీ బాధ్యులు తెలిపారు.

జాబ్‌మేళాకు 66 మంది హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎంఎస్ఎన్ ఫార్మా, నెక్స్ట్ వేవ్ నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌కు 66 మంది హాజరుకాగా, 12 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మార్కండేయ చంద్రమౌళీశ్వరుడికి పూజలు

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఇటీవల నిర్మించిన భక్తమార్కండేయస్వామి ఆలయంలో కొలువైన చంద్రమౌళీశ్వరుడికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అభిషేకం, మహాహారతి, సత్యనారాయణస్వామివ్రతం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

కొండాపూర్ ఎస్ఐగా భరత్‌కమార్‌రెడ్డి

కొండాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ ఎస్ఐగా సీహెచ్.భరత్‌కమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ వీఆర్ నుంచి కొండాపూర్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన హరిశంకర్‌గౌడ్ హైదరాబాద్ మల్టీజోన్‌కు బదిలీఅయ్యారు.

పథకాల అమలులో విఫలం

ఝరాసంగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ యువజన మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బత్తిని పాండు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

'బిల్లులను చెల్లించాలి'

వెల్దుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి, ఉప్పులింగాపూర్ గ్రామాలలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను వెంటనే యజమానులు చెల్లించాలని వెల్దుర్తి విద్యుత్‌శాఖ ఏఈ పెంట్యానాయక్ తెలిపారు. సోమవారం ఆయన వెల్దుర్తి డబుల్ బెడ్‌రూమ్‌లలో ఉన్న విద్యుత్ మీటర్లను పరిశీలించి మాట్లాడారు. ఏడాదిగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు.

22వ రోజు దీక్ష

నర్సాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నల్లవల్లి ప్రాంతంలో డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం 22వ రోజుకు చేరింది. సోమవారం మున్సిపల్ పరిధిలోని పదోవార్డుకు చెందిన అఖిలపక్షం నాయకులు బుచ్చేస్‌యాదవ్, షైడిశ్రీధర్‌గుప్తా, జ్ఞానేశ్వర్, నారాయణరెడ్డితో పాటు పలువురు కూర్చున్నారు.

ఆలయ ఆస్తుల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

జిన్నారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కొడకంచి ఆదినారాయణస్వామి ఆలయ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ పెంటాగౌడ్ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టరేట్‌లో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా ఆలయానికి చెందిన భూములైన ఎల్లమ్మ కుంట, ఆలయ చెరువులో నుంచి మట్టి అక్రమ తవ్వకాలు, లీజు ఒప్పందాలు, చేపల చెరువు వేలంలో ఆలయ ఫౌండర్ అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అక్రమాలకు పాల్పడ్డ ఫౌండర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటాగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి పాలకమండలి ప్రమాణ స్వీకారం

● పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



పాలకమండలి ప్రమాణ స్వీకార సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి

గుమ్మడిదల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు యాదగిరిగౌడ్, మద్దేటి వీరాస్వామి, పోతరాజు ఆశ, శ్రీనివాస్‌గౌడ్, భజరంగ్‌సింగ్, పొన్నబోయిన రాజు, పూజారి కృష్ణ, కోటేశ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, అశోక్, శివనాగులను నిర్మలాజగ్గారెడ్డి సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా నేతలు నీలం మధు, కాటా శ్రీనివాస్‌గౌడ్, కాటా సుధారాణి, పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బొల్లారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ వీ.చంద్రారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు, వడ్డే కృష్ణ, మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీలు సురభీనాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, మాజీ ఉపసర్పంచులు ఎం.నరేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు భద్రప్ప, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్లు అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని సంగారెడ్డి వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి సంజీవనగర్‌లోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్షా అభియాన్, అలీమ్‌కో సంయుక్తంగా జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కలెక్టర్ దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు అన్ని రకాల సౌకర్యాల, ప్రత్యేక విద్యా, ఫిజియోథెరపీ, ఇంటి వద్దనే విద్య సహాయ ఉపకరణాలు, ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 102 మందికి 214 రకాల సహాయ ఉపకరణాలు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ వెంకటేశం, ఎంఈవో విద్యాసాగర్, ఐఈఆర్‌పీ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డి సంజీవనగర్‌లోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ క్రాంతి డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య తదితర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు అనిత కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతానని కలెక్టర్ హామీఇచ్చారు.

దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మెదక్ సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల అమలు తీరును అడిగి తెలుసుకుని మాట్లాడారు. జిల్లా అధికారులు, మున్సిపల్, పంచాయతీ సెక్రటరీలు దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తుదారులకు ఫోన్‌చేసి ఎల్ఆర్ఎస్ గురించి వివరంగా చెప్పాలన్నారు. గతంలో లేఅవుట్ చేసి 10 శాతం ప్లాట్లు విక్రయించకోగా, మిగితా 90 శాతం ప్లాట్లకు మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటూ ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీ వరిస్తుందని కలెక్టర్ తెలిపారు.

●నర్సాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31వ తేదీలోపు నిర్దేశించిన ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ రాకమష్టారావు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ డీఈఈ సంజీవరెడ్డితో కలిసి వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సెకండియర్ ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సెకండియర్ ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 16,084 మందికి 15,780 మంది హాజరుకాగా, 304 మంది గైర్హాజరయ్యారు. 98.11 హాజరుశాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. సదాశివపేటలోని భవిత జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

మూల్యాంకనం షురూ

సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. నాలుగు విడతల్లో మూల్యాంకన ప్రక్రియ చేపట్టనున్నారు. ఏప్రిల్ మొదటివారం వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుందని డీఐఈవో గోవిందరామ్ తెలిపారు.

వంతెనకు అప్రోచ్ రోడ్డు వేయిస్తా: ఎమ్మెల్యే



ముద్దాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట/చిన్నశంకరంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మెదక్ నియోజకవర్గం రామాయంపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని, ఇందుకు రూ.200 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. సోమవారం పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రాధాన్యతా అంశాలుగా తాను అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతానన్నారు. అంతర్జాతీయ స్థాయి విలువలతో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసే యంగ్ ఇండియా స్కూల్‌లో సుమారు 2,560 మంది విద్యార్థులు చదువుతారని తెలిపారు. ముద్దాపూర్ గ్రామ శివారులో రెండు బ్రిడ్జిలు, ఆలయం వరకు సీసీరోడ్డు, బోరు మంజూరు చేయిస్తానన్నారు. మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని మంజీరా నదిపై నిర్మించిన వంతెనకు పాపన్నపేట నుంచి అప్రోచ్ రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్థులు సన్మానించారు. ఆయన వెంట చిన్నశంకరంపేట నాయకులు ఆవుల గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. చిన్నశంకరంపేట మండలం బాగిర్తిపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప జాతరలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళా లోకానికి దిక్సూచి సావిత్రిబాయి పూలే

● కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్/నాగల్‌గిద్ద/మనూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి మహిళల్లో చైతన్యం తీసుకొచ్చి చదువుకునేలా ప్రోత్సహించిన సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి దిక్సూచి అని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా చిట్కుల్‌లోని ఎంఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాగల్‌గిద్ద మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో, మండల కేంద్రమైన మనూరులో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవీందర్, యేసయ్య, మానయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషీ సంజీవ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు.

నిఘా నీడలో టెన్త్ పరీక్షలు: డీఈవో రాధాకిషన్



అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/రేగోడు/చేగుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. సోమవారం అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తలెత్తుతున్న సమస్యలను ఎంఈవో ధనుంజయగౌడ్ డీఈవోకు వివరించారు. అలాగే పెద్దశంకరంపేటలోని బాలుర ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆన్‌లైన్‌లో విద్యార్థులు రాస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించారు. రేగోడు మండలం కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు, మోడల్ పాఠశాలలోని విద్యార్థినులకు వాసవీ క్లబ్ మనం అశోక్‌నగర్ ఆధ్వర్యంలో స్టీల్ బాటిళ్లను డీఈవో రాధాకిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు రాధాకృష్ణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్వయంప్రభ పాల్గొన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చేగుంట మండల సీఆర్పీ రమేష్‌నాయక్, శ్రీనివాస్ కుటుంబాలకు సీఆర్పీలు, ఉపాధ్యాయులు సేకరించిన రూ.12 లక్షలను డీఈవో రాధాకిషన్ చేతులమీదుగా వారి పేరుమీద డిపాజిట్ చేసిన పత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నీరజ, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సమగ్ర శిక్షా ఉద్యోగుల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శేషాద్రి, మెదక్, సంగారెడ్డి,జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, ఇసుక తవ్వితే చర్యలు

నర్సాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చెరువుల్లో, కుంటల్లో అక్రమంగా మట్టి, ఇసుకను తవ్వితే కఠిన చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ డీఈఈ బుజ్జిబాబు హెచ్చరించారు. సోమవారం 'తోడేస్తున్నారు' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ క్రమంలో హన్మంతాపూర్ సమీపంలోని పెద్దచెరువు, చింతలకుంటలను స్థానిక ఏఈ మణిభూషణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు, కుంటల సమీపంలో పలుచోట్ల మట్టి కుప్పలు ఉన్న విషయం గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారమించారు. అదేవిధంగా ఆర్ఐ ఫైజల్ కూడా అక్రమంగా తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు.

లిఫ్ట్ ఆపరేటర్ దుర్మరణం

రామచంద్రాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వర్తిస్తూ లిఫ్ట్ ఆపరేటర్ దుర్మరణం చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మాగస్ కుమార్(27) రెండేళ్ల క్రితం తెల్లాపూర్‌కు వలస వచ్చి లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తెల్లాపూర్ లేబర్ షెడ్‌లో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఆక్రుతి నిర్మాణ సంస్థలో పనులకు వెళ్లాడు. పైఅంతస్తుకు గృహ నిర్మాణ పరికరాలను క్రేన్ ద్వారా తరలించడానికి ఏర్పాట్లు చేశాడు. నిర్మాణ సామగ్రి తీసుకువెళ్లే బొక్కెన కింద నిల్చున్నాడు. ఈ క్రమంలో క్రేన్ తీగ తెగిపోవడంతో బొక్కెన మాగస్‌పై పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్ఐ రవీందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

మట్టి దందాను అడ్డుకోండి: కాంగ్రెస్

పుల్‌కల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలో అక్రమ మట్టి దందా వ్యాపారాన్ని అడ్డుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ కోరారు. తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, రాములు, కలాలి ఈశ్వర్‌గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కొంతమంది మాఫియాగా ఏర్పడి పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ మట్టి వ్యాపారానికి రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు ముడుపులు తీసుకుని సహకరిస్తున్నారని ఆరోపించారు.

మట్టి అక్రమ తవ్వకాల ఫిర్యాదుపై విచారణ

జిన్నారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వావిలాల శివారులోని 189 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి నుంచి రెండురోజులుగా వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా చేపట్టారు. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ ఆయా భూములను సందర్శించారు.

యువకుడు అదృశ్యం

రామచంద్రాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన దీపక్ సింగ్(30) వికారాబాద్ జిల్లా పులుసు మామిడిలో నివాసముంటూ ఆయుర్వేద మందులు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 8న ఉస్మాన్‌నగర్‌లో నివాసముంటున్న సోదరి ఇంటికి వచ్చాడు. 9న బైక్‌పై తిరిగి వికారాబాద్‌కు బయలుదేరాడు. కానీ వికారాబాద్ చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించినా.. ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాజెక్టుల కోసం పోరుబాట: క్రాంతికిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న చంటి క్రాంతికిరణ్

రాయికోడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు నిర్మించకపోతే త్వరలో పోరుబాట ప్రారంభించినట్లు ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులతో 2 లక్షల 47 వేల ఎకరాలకు భూములు సస్యశ్యామలం కావాలనే సదుద్దేశంతో మహత్తరమైన కార్యక్రమం నిర్వహించిందన్నారు. ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గ రైతులకు ఎంతో మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టులను 'ఎక్కడవేసిన గొంగడి' అక్కడే అన్న చందాన ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చేవేళ్ల విఠల్, కొల్లూరు శంకర్, యూత్ అధ్యక్షుడు అంజిముదిరాజ్, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

సవాళ్ల స్వాగతం

5వ పేజీ తరువాయి

వెంటనే జారుకుంటున్నారు. గడిచిన ఏడాది జిల్లాలో 639 దొంగతనాలు, దోపిడీలు జరిగాయి. ఇక ఆన్‌లైన్ మోసాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. గత ఏడాది కాలంలో 800 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. రూ. 50కోట్ల నగదును సైబర్ నేరగాళ్లు దోచేశారు.

పోలీస్‌శాఖపైనా విమర్శలు

కొందరు పోలీసుల తీరుతో జిల్లా పోలీసుశాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక వ్యాపారులకు సహకరిస్తున్నారని ఒకరు, గంజాయి అక్రమార్కులతో చేతులు కలిపారని ఇంకొకరు, భూదందాల్లో తలదూర్చారని మరొకరు.. ఇలా పలువురు పోలీస్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడమే ఇందుకు నిదర్శనం. కిందిస్థాయి సిబ్బందిపైనా అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలువురు పోలీసులు సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకుంటున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరు ఖాకీల సహకారంతో జిల్లాలో గంజాయి, ఇసుక, రేషన్ బియ్యం, సివిల్ తగాదాలు యథేచ్ఛగా జరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది. కొత్త ఎస్పీ ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలకు హాజరైన మేయర్ విజయలక్ష్మి

రామచంద్రాపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీలో మూడురోజులుగా జరుగుతున్న రామాలయం, శివాలయం, సరస్వతీదేవి, జంటనాగులు విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. సోమవారం ఉదయం నుంచి వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. కార్పొరేటర్ పుష్పానగేష్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పూజలకు హాజరయ్యారు. అనంతరం ఆలయంలో మొక్క నాటారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న మాజీ సర్పంచులు

చిన్నశంకరంపేట/వట్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మాజీ సర్పంచులు సోమవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన అంజిరెడ్డిని బీజేపీ వట్‌పల్లి నాయకులు కలిసి సన్మానించారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

పుల్‌కల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగయ్య అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ గ్రామస్థులు ఆరోపించారు. సోమవారం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయానికి తరలివెళ్లి ఫిర్యాదు చేశారు. ఇంటి నిర్మాణ అనుమతికి డబ్బులు వసూళ్లు చేయడమే కాకుండా, జనన, మరణ ధ్రువీకరణపత్రాల మంజూరుకు రూ.5 వేల చొప్పున డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 90 గజాల ఇంటి నిర్మాణానికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శి రంగయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

పార్కుల అభివృద్ధికి నిధులు: కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బస్తీల్లో పార్కుల సుందరీకరణ పనులు చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ సండేమార్కెట్ ప్రాంతంలోని బాలవిహార్ పార్కులో జరుగుతున్న సుందరీకరణ పనులు పరిశీలించారు. ప్రహరీ, ఓపెన్‌జిమ్, లైటింగ్ పనులు చేయాల్సి ఉందని తెలిపారు.

ఘనంగా పుష్కర బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం భెల్ కాలనీ విశ్వకర్మ ఆలయంలో సోమవారం కంచి కామాక్షి అమ్మవారి పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు భూపాల్‌రెడ్డి పరామర్శ

నారాయణఖేడ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు మాజీ కౌన్సిలర్ నూర్జహాన్‌బేగం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకొని సోమవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నూర్జహాన్‌బేగం కుమారుడైన మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్‌కు మానసిక స్థైర్యాన్ని కల్పించారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

మనోహరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మనోహరాబాద్ యాదవ కులస్తులు ఒగ్గు కథలు, అగ్నిగుండాలు, బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.